# తన శాంతమే తనకు రక్ష!

ఓ. కామేశ్వరి



**శాంత చెంప ఛెళ్లుమంది! ఛెళ్లుమనిపించింది మరెవరో కాదు, ఆమె పతిదేవుడు.**

మరి పెళ్లాన్ని కొట్టే హక్కు మొగుళ్లకు ఉంది గదండీ ఈ దేశంలో! ఈ చెంప ఛెళ్లుమనడం శాంతకి గత తొమ్మిదేళ్లుగా, అందులో ఈ ఏడాదిలో మరీ అలవాటైపోయాయి. ఇప్పటికెన్నిసార్లు ఛెళ్లుమందో లెక్కలు పెట్టుకోవడం మానేసింది శాంత. మొదటిసారి చెంప ఛెళ్లుమన్నప్పుడు ఉక్రోషం, అవమానంతో, తన తప్పేమిటి అని అడిగి మరో దెబ్బ తిని నిస్సహాయతతో కుళ్లికుళ్లి ఏడ్చింది. ఎంత ఏడ్చినా అతనేం పట్టించుకోడని, తన కన్నీళ్లు ఏం తుడవడని ఐదారుసార్లు తర్వాత అర్థమయ్యాక శాంతకి కన్నీళ్లు రావడం మానేశాయి. చెంప పట్టుకుని, పెద్దపెద్ద కళ్లనిండా తిరస్కారం నింపుకుని చూసేది. 'ఏమిటా చూపు, గుడ్లగూబలా కళ్లేసుకుని. ఏం, మింగేస్తావా?' అంటూ ఆ



చూపు చూసి తిక్కరేగి మరోసారి చెంప ఛెళ్లమన్నా అలాగే చూసేది శాంత. అలా చూసే పెళ్లాన్ని ఏం చెయ్యలేక 'దరిద్రపు మొహం! అవతలికి తగలడు!' అనేవాడు ఆ మగమహారాజు. శాంత అదేరకం నిర్లక్ష్యపు ధోరణితో నవ్వి అవతలికి వెళ్లేది. 'కొడతావు. అదేగా నీకు చాతొచ్చింది. పెళ్లాన్ని ఎలా చూసుకోవాలో తెలియని నీలాంటి నికృష్టులకి పెళ్లి ఎందుకురా... పెళ్లాన్ని కొట్టడం మగతనం అనుకునే వెధవలకి, సున్నితం, లాలిత్యం పదాలకి అర్థాలు తెలుసుంటే ఆడదాన్ని ఎలా చూసుకోవాలో తెలిసేది. అలాంటి మగాడికి ఆడది పాదదాసి అవుతుందిరా! కొట్టి, తిట్టి ఆడదాన్ని గెల్చుకోలేవురా!' ఆ చూపుకి అర్థం ఇదీ అని తెలుసుకోగలిగిన జ్ఞానం ఉంటే ఆ మానవుడసలు కొట్టకపోయేవాడు కాదన్నది శాంతకి అర్థమవడానికి కొన్ని రోజులు పట్టింది. అలాంటి మృగంమీద ఉమ్మినా బుద్ధి రాదు. అలాంటివాడి గురించి ఆలోచించడం దండగ అని తేల్చేసుకుంది. ఆ తరువాత 'తన శాంతమె తనకు రక్ష' అన్న సుమతీ శతకం పద్యం జ్ఞాపకం తెచ్చుకునేది శాంత అతను కొట్టినప్పుడు కోపం రాకుండా ఉండటానికి.

"అమ్మా... శాంతమ్మా! క్షమయా ధరిత్రీ అన్నారు కదా అని మరీ అంత శాంతం పనికిరాదమ్మా! ఊరుకుంటే మొగుడికి లోకువయితే ఊళ్లో ముష్టివాడికీ లోకువవుతావు. పడుతూంటే కొడ్తూంటారు తల్లీ!" అని మనలాంటి వాళ్లు జాలిపడి సలహా ఇస్తే, "పడను. పడాలని నాకేం లేదు. నాకు క్షమయా ధరిత్రీ బిరుదుల మీద వ్యామోహం లేదు. కానీ, ఎదురు తిరుగుతాను. మరి రెండు తగులుతాయి. ఛీ, ఫో" అని నేనూ రెండు కొట్టి బయటకు వస్తే మీరాదుకుంటారా?" అని మనలాంటి వాళ్లని నిలదీసి ప్రశ్నిస్తే... చల్లగా అక్కడనుంచి జారుకుని మొహం చాటుచేసుకోవాలి. మనం చెయ్యగలిగిన సాయం అంతకంటే లేదు కనుక, "ఏం అమ్మా, ఈ మాత్రం బతకలేకపోవు బయటకొస్తే!" అనచ్చు సులువుగా. "అంట్లు తోముకో, వంట చేసుకో, మిషను కుట్టుకో!" అంటూ సినిమా సలహాలు ఇవ్వచ్చు.

"బయటకొస్తే ఇంతకంటే మంచి జీవితం ఉంటుందన్న భరోసా ఇస్తే అలాగే మిషను కుట్టుకుంటా, వంటలు చేసుకుంటా...!" అని పెద్ద పెద్ద కళ్లతో అమాయకంగా అడిగితే మీరేం చెపుతారు. మీ దగ్గరేమన్నా జవాబు ఉందా?

"అయ్యా, ఆదుకోడానికి అమ్మ లేదు, నాన్నున్నా సవతి తల్లి చేతిలో బొమ్మ. కాళ్లమీద నిలబడడానికి సరిపడా చదువు లేదు. నాకు తోడు ఇద్దరు పిల్లలు! పిల్లలు పుట్టకముందు ఈ ఆలోచన రాలేదు. అప్పుడసలు అలా కూడా చెయ్యచ్చన్న ఆలోచన తట్టనంత అమాయకత్వం. ఈ పిల్లలకి తండ్రిని దూరం చేయడం ఎందుకు? తండ్రి వాళ్లనేం దగ్గర తీయడు. ముద్దుమురిపాలు ఏం చేసేస్తున్నాడనీ కాదు, పేరుకన్నా సమాజంలో తండ్రి ఉండాలి గదండీ! రేప్పొద్దుట ఈ పిల్లలే ఎదురు తిరిగి 'మా నాన్నని లేకుండా చేశావు. నీవు మాకేం చేశావు. నాన్న దగ్గరుంటే ఇల్లుండేది, డబ్బుండేది. మమ్మల్నిట్టా బికారుల్లా పెంచావు' అని నిలదీస్తే నేనేం జవాబివ్వాలండీ! ఇవ్వన్నీ ఆలోచించానండీ బాబు! రీజన్ చెంపదెబ్బ తినడమే నయమన్న నిర్ణయానికి వచ్చాను!" అంటుంది ఇంకా ఎవరన్నా సానుభూతి చూపబోతే.

అసలెందుకమ్మా నీ మొగుడలా కొడతాడు అంటే "ఏందుకేమిటండీ, మొగుడు కనుక!" అంటుంది ఓ వెర్రి నవ్వు నవ్వి. "మొగుడయితే... అందరి మొగుళ్లు ఇలా కొడతారా ఏమిటి?" "అది వాళ్లు చేసుకున్న పుణ్యం."

"నీవసలు అడిగావా ఎప్పుడన్నా కారణం ఏమిటని?"

"కొట్టిన మురుదురోజే అడిగానండీ! 'నేనేం చేశానండీ' అని. ఆయన గుడ్లురిమాడు. 'నోర్మయ్! ఏం చేశావా! జవాబు చెప్పాలా నేను! నిన్నెందుకు కొట్టానో సంజాయిషీ ఇచ్చుకోవాలా?' గుడ్లురిమారు. "అయినా తెల్లారి లేస్తే ఆయనకి నా పనుల్లో ఎన్ని తప్పులు కనిపిస్తాయండీ... మొగుడన్నాక భయం భక్తీ ఉండొద్దండీ ఆడదానికి. కాఫీ వేడిగా ఇవ్వాలి. బొత్తం కుట్టమన్నాక మర్చిపోకుండా వెంటనే కుట్టాలి గదండీ! స్నానానికి వేడినీళ్లు సరిగా ఉన్నాయో లేదో చెయ్యిపెట్టి చూడద్దండీ! వంట చేసేటప్పుడు ఒళ్లు దగ్గరుంచుకుని ఉప్పు కారాలూ మర్చిపోకుండా సరిగా వెయ్యాలి కదండీ! వంట రుచిగా కూడా వండలేని ఆడది ఏం పెళ్లామండీ! ఆడది మొగుడింటికి వచ్చేసరికి పనీపాటా పూర్తి చేసుకుని చక్కగా మొహం కడుక్కుని శుభ్రంగా తయారై కనపడద్దండీ! జిడ్డు మొహం, చెమట మొహంతో వంటింట్లో సతమతమవుతూ, పిల్లలని ఏడుపు మొహాలతో చంకనేసుకురాగానే కనిపిస్తే పాపం ఆ మగమహారాజుకి చిర్రెత్తదండీ! ఇంట్లో పిల్ల వెధవలు ఉచ్చలు గట్రా పోస్తే శుభ్రం వెంటవెంటనే చేసెయ్యాలి. పిల్లల వస్తువులు చిందర వందరగా పడుంటే సర్ది ఇల్లు శుభ్రంగా పెట్టాలి గదండి. ఏ పండగొస్తేనో నోరు తెరిచి చీర అడిగి విసిగించడం ఎందుకు, ఆయనే కొనిస్తారు కదండీ డబ్బుంటే. పిల్ల వెధవలు ఎదిగిపోతూ బట్టలు పొట్టయితే మరి కొనిపెట్టాలంటే.... అస్తమాన్నూ కొనాలంటే మగాళ్లకి కోపం వస్తుంది కదండీ. అసలే పాపం ఆయనకి రెండు మూడు నెలలకో డ్రెస్సు కొనడానికే డబ్బు లేనప్పుడు పెళ్లాం పిల్లలు ఆయన మెడకి చుట్టుకుని వేధిస్తే కోపమే కదండీ! ఆయనాఫీసులో పనిచేసే ఆడపిల్లలంతా చక్కగా కడిగిన ముత్యాల్లా ఉంటారటండీ! ఆయన ఖర్మకొద్దీ జిడ్డు మొహాన్ని దొరికాను గదా మరి పాపం! ఆయనకి చిన్నతనం కదా! పాపం, ఆయనకి పెళ్లాం అలా చిలకలా సింగారించుకుని గలగలా ఇంగ్లీషు మాట్లాడాలని ముచ్చటగా ఉండదండీ...! ముందు చేసుకునేటప్పుడు చూసుకోవాలంటారు. బాగుందండీ, అప్పుడేదో అమ్మా నాన్నా బలవంతం పెడితే, చెల్లెలి పెళ్లికి కట్నం కావాలని సతాయిస్తే ఏభైవేలు కట్నం వస్తుందని ఈ పల్లెటూరి మొద్దుని, మెట్రిక్ ఫెయిలయిందాన్ని చేసుకున్నారు పాపం. చేసుకున్నాక కదండీ పెళ్లాంలో

లోపాలు
బయటపడతాయి.
ఆఫీసుల్లో చిలకల్లాంటి
అమ్మాయిలను చూశాక పాపం
ఆయన జీవితంలో ఎంత నష్టపోయారో
తెలుసుకున్నాక ఇంకా ఉడుకుమోత్తనం వస్తుంది
గదండీ. నీలో ఇన్ని లోపాలు వెతికే నీ మొగుడేం
మన్మథుడా అని అడుగుతారా ... భలేవారే!
మొగుడికెందుకండీ అందం? పొట్టిగా, నల్లగా,
బట్టతలున్న మొగుడు మగాడే కదండీ!

'ఆయనేం పెద్ద ఆఫీసరా, లక్షలాస్తి ఉందా, నిన్ను పల్లెటూరి మొద్దు... చదువురానిది అనడానికి. ఆయనేం ఇంజనీరా, డాక్టరా, కలెక్టరా?'

"అయ్యో రామ, అదేం కాదండీ బాబూ! వుత్తి బి.ఏ. అండీ, అదీ రెండోసారి పాసయ్యారండీ! చేసేది గుమాస్తా ఉద్యోగం అండీ బాబూ! దీనికే ఆయన నన్నింత చులకనగా చూస్తున్నారు. నిజంగా ఏ కలెక్టరో అయితే చచ్చేదాన్నిలెండి!"

"ఈ మాత్రందానికేనా తల్లీ ఇంత మిడిసిపాటు!"

"బాగుందండీ, కలెక్టరయినా, గుమాస్తా అయినా, బంట్రోతయినా పెళ్లానికి మొగుడు కాదాండీ!"

"ఆఫీసుల్లో అమ్మాయిల్లా చిలకల్లా కనపడమంటే చక్కగా ఏడాదికి పది పన్నెండు చీరలు కొనిపెట్టమను. దాసదాసీ జనాన్నిపెట్టి ఇంట్లో పనులు చేయించమను. అప్పుడు చిలకలా సింగారించుకుని మొగుడొచ్చేసరికి నవ్వుమొహంతో ఎదురొచ్చి కాఫీ కప్పు వయ్యారంగా చేతిలో పెడతానను! అసలు నీకు బుర్ర లేదు. అలా అంటే మళ్లీ ఆ మాటంటాడా? ఈయనగారు కొనిచ్చే ఏడాదికి నాలుగు చీరల్లో చిలకలా ఎలా సింగారించుకుంటుంది? ఇంటెడు చాకిరీ, ఇద్దరు చంటిపిల్లలతో సింగారించుకోడానికి టైమెక్కడ అనడగరాదా! ఇంతకీ నీ మొగుడెప్పుడూ టిప్‌టాప్‌గా ఉంటాడా?"

"అయ్యో రామ! ఆఫీసుకెళ్లినప్పుడు తప్ప ఇంటికి రాగానే ఆ కుళ్లు లుంగీ గుడ్డ చుట్టుకు కూర్చుంటారు. పెళ్లాలు రంభల్లా కనపడాలి గానీ, మొగుళ్లు చెమటలు కారుతూ, కుళ్లుగుడ్డలతో, కంపువోళ్లతో పెళ్లాల దగ్గరకొచ్చినా భరించాలండీ బాబూ! పెళ్లాల దగ్గర ఎందుకండీ బాబూ మొగుడు సింగారించుకోవడం. అదే చక్కగా ఏ చిలకన్నా దొరికిందనుకోండి, గడ్డాలు రోజూ... రోజూ ఏం ఖర్మలెండి, రెండుపూటలా గీసుకుంటారు. మడత నలగని బట్టలు వేసుకుంటారు. సెంట్లు పూసుకుంటారు. హుషారుగా ఈల వేసుకుంటూ తిరుగుతారు."

"ఏమిటలా అంటున్నావు? మీ ఆయనకి ఏ చిలకన్నా దొరికిందా ఏమిటి?"

"ఈయన మొహం, ఈ అవతారం, ఈ ఉద్యోగం చూసి ఏ చిలకొచ్చి వాల్తుందిలెండి ... అలా వాలలేదనేగా ఏడుపు. ఆ ఏడుపు, చిరాకు, కోపాలు అందుకే గదండీ ఎక్కువై ఆ చాతకాని ఉక్రోషం పెళ్లాలమీద చూపిస్తారు! ఆఫీసులో ఓ పెళ్లి కాని చిలక వచ్చిందని, ఆ చిలకను ప్రసన్నం చేసుకోవడానికి లైను కట్టిన గోరంకల్లో ఈయనా ఒకరని తెల్సిందిలెండి! ఆవిడగారొచ్చిందగ్గరనుంచి, ఆవిడ గంజిపెట్టి మడత నలగని చీరలు, మేకప్పు మొహం, దొండపండులాంటి లిప్‌స్టిక్ పెదాలు... అలా తలెగరేసుకుంటూ సవరించుకునే బాబ్డ్ హైరు, టకటక మాట్లాడే ఇంగ్లీషు చిలక పలుకులు... అలా టైప్‌రైటర్‌మీద అలవోకగా కదిలే నైల్ పాలిష్ వేళ్లు... ఆవిడ రాసుకొచ్చే సెంట్ల ఘుమఘుమలు ఈ గోరంకలు మతులు పోగొట్టుంటే, అలాంటి పెళ్లాం ఉంటే బాగుండునని కలలు కంటూ, అలాంటి పెళ్లాం లేనందుకు ఏడ్చుకుంటూ, ఆవిడగారి చిరునవ్వు వరం కోసం పాకులాడుకుంటూ, కొత్త డ్రెస్సులు కుట్టించుకుని, రోజూ గడ్డాలు గీసుకుని, స్మార్ట్ గై అనిపించుకోవడానికి తాపత్రయాలు పడుతూ ఆవిడ ఏనాటికీ కనికరించని గుళ్లో దేవతలా వీళ్లని పట్టించుకోకపోతే కోపం రాదండీ పాపం! ఆశాభంగం భరించడం ఎంత కష్టం! ఆ నిరాశా నిస్పృహలు వీళ్లని కాల్చేస్తుంటే ఆ చిరాకులు, పరాకులు భరించాల్సింది పెళ్లాలే గదండీ మరి! అందుకేనండీ బాబూ ఈ ఏడాది నుంచి చెంపదెబ్బలు, చిరాకులు మరీ ఎక్కువైపోయాయి. రాణీగార్ని చూసిన కళ్లతో మరి పెళ్లాన్ని చూస్తే దేభ్యం మొహంలా, అప్పలమ్మలా కనపడితే తట్టుకోవడం ఎంత కష్టం!?"

"ఏడిశాడు, ఆ చిలక ఇంటికి ఏ పొద్దుటో, రాత్రో ఓసారి తగలడమను. తలుపు తీస్తుంది అప్పలమ్మలాగే. ఇంట్లో రోజంతా సింగారించుకుని ఎవరూ కూర్చోరన్న ఇంగిత జ్ఞానం ఉండద్దా ఈ మగమహారాజులకి!"

"ఆ మాత్రం ఇంగితాలుంటే అందనివాటి కోసం అర్రులు చాస్తూ ఏడుస్తారా? ఆ మాత్రం తెలివి, బుద్ధీ ఉంటే పెళ్లాల్లోనే ప్రేయసులని వెతుక్కుంటారు."

"అబ్బ... గడుసుదానివే! ఏం తెలీనట్టుంటావు, నీకు చాలానే తెలుసే! ఇంతకీ మీ ఆయన ఆఫీసులో కొత్త చిలక వాలిందన్న కబురు

## కోయిల క్రొత్తపాట

ఉ. కోమలమల్లికా కుసుమకుంజము పూచెను, పచ్చపచ్చగా
ఆమని తోచె, మందమలయానిలవీచిక వీచె కోకిల
స్వామి! సదా మృదుస్వరరసశ్రుతితో శ్రుతిపేయమై ప్రజా
క్షేమము కల్గునట్లు పలికింపుము నూతనరీతి గీతమున్.

చ. కులమతవర్గభేదముల గోరపుకొండలపాటు నొందుచున్
విలవిలలాడు లోకమున క్షేమమయోన్నత మానవత్వపుం
గలిమిని సంతరించుచు పగల్ సెగలారగ శాంతిసౌఖ్యసం
కలితముగా సుధామధురగానము సేయు ముగాది కోయిలా!

ఉ. మెత్తని మావిక్రొంజిగురు మేతగ జీవిక బుచ్చుచున్ జగా
క్రొత్తగ రూపు దిద్దుకొను గొంతును దుర్బలమౌ ప్రజాళిపై
కత్తులు నూరుచున్న ఘనకర్కశచిత్తుల గుండియల్ దయా
యత్తముగా మరందమధురాలపనమ్మున కూయుము కోయిలా!

ఉ. నీతికి పాటగొట్టి అవినీతికి పట్టముగట్టి, ద్రవ్యలో
భాతతబుద్ధితో పరుల వంచన సేయుచు సంచరించు దు
ర్నేతల చేతలన్, దురుసురీతిని చాటుచునున్ జగమ్మునన్
నూతనచేతనత్వరుచి నూల్కొన గానము చేయు కోయిలా!

వేముగంటి నరసింహాచార్యులు



ఎవరు ఊదారు నీ చెవిలో?"

"మా ఆయన బాస్‌గారి పెళ్లాం ఆడాళ్ల వ్రతం ఏదో చేసే వాయనానికి ఆఫీసులో ఆడాళ్లందరినీ పిలిచిందిలెండి. పెళ్లినాటి ఒకే ఒక పట్టుచీర ఇస్త్రీ చేయించుకుని కట్టుకెళ్లానులెండి. అదిగో, ఆఫీసులో పనిచేసే ఆరుగురు ఇల్లాళ్లు, ఈ కన్నెపిల్ల కూడా వాయనానికి పనికిరాకపోయినా సరదాగా వచ్చిందిలెండి. ఆ సూర్యారావు పెళ్లాం నా చెవిలో ఊదింది మన మొగుళ్లందరూ ఆఫీసులకింత ఠంచనుగా, చక్కగా తయారై ఎందుకెడుతున్నారనుకుంటున్నావూ అంటూ... కన్నుగీటి నవ్వుతూ చెప్పింది."

"ఏం, ఆ చిలక అంత చక్కగా ఉందేమిటి... ఇంతమంది లైను కట్టడానికి!"

"ఆఁ, దాని బొంద! అందం ఏం కాదులెండి, ఆకర్షణ తప్ప. అలా నేనూ తయారవుతే దానికంటే బాగానే ఉంటానులెండి. వయసు మిలమిల, మేకప్పుల తళతళలు అంతేలెండి!"

"అయితే ఆ పిల్లది మీ మొగుళ్లందరినీ పాడు చేస్తుందన్నమాట. ఇదేం బుద్ధి దానికి పెళ్లి కావాల్సిన పిల్ల ఇంతమందితో..."

"రామ రామ! అంత మాటొద్దులెండి. ఆ పిల్లేం చేసిందిలెండి, మన బంగారం మంచిదయితే...! చొంగ కార్చుకుంటూ తన వెంట తిరగమని ఆ అమ్మాయి పిలిచిందేమిటి? ఆ అమ్మాయిలో తప్పు నాకేం కనపడలేదండీ. అందరితో చనువుగా మాట్లాడింది గలగలా. ఓమారు 'వెంకట్రావుగారి భార్యా' అని పలకరించింది. నవ్వుతూ నన్ను 'మా ఇంటికి ఓసారి రండి' అంటే, 'వస్తానండీ! వెంకట్రావుగారు ఎప్పటినుంచో పిలుస్తున్నారు, మీరూ పరిచయం అయ్యారుగా, వస్తాలెండి' అంది పాపం."

"ఓఁ ఈయనగారు అప్పుడే ఆవిడగారిని ఇంటికి ఆహ్వానించారన్నమాట!"

"మరేనండీ, పాపం ఆ పిల్ల నేను పరిచయం అయ్యాక ఓసారి మా కొంపకి వచ్చిందిలెండి. అబ్బో ఆ రోజు ఆయన హడావుడీ, ఆర్భాటం చూడాలి... ఇల్లంతా బూజులు దులిపించారు. ఉన్న ఒక్క టేబిల్ మీద క్లాత్ ఉతికించారు. గుమ్మాలకి పరదా గుడ్డలు కొని కుట్టించారు. ఇరుగింటి నుంచి పొరుగింటినుంచి ఓ రెండు కుర్చీలు తెచ్చారు. 'దేభ్యం మొహం నువ్వూనూ! కాస్త ఇవాళయినా శుభ్రంగా తయారయి తగలడు! ఆ పిల్లవెధవ లిద్దరినీ కాస్త తయారుచెయ్యి. ఆ వెధవలిద్దరూ లేకిగా టిఫిను పళ్లాల మీద ఎగబడకుండా చూడు! నేను స్వీట్లు తెస్తా. కాస్త బాగా పకోడీలు... వేడివేడిగా వేసి, ఫిల్టరులో కాఫీ పొయ్యి!' ఆర్డర్లు పాస్ చేస్తూ హడావిడి పడిపోయారు. హైరాన పడిపోయారు. బజారుకెళ్లి తెల్ల పైజామా, కుర్తా కొనుక్కొచ్చుకున్నారు."

"ఏమిటిదంతా... టైపిస్ట్ అమ్మాయికోసమే! పోనీ ఏ బాసన్నా వస్తున్నాడంటే అర్థం ఉంది!"

"మీరేమిటండీ బాబూ, అంత తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు! బాసయితే మగాడే కదండీ, ఈవిడంటే ఆడది... అందునా పెళ్లికాని పిల్ల... టిప్‌టాప్‌గా ఉండే పిల్ల అయింది.

'వెంకట్రావంటే ఏమిటో అనుకున్నాను గానీ ... అని అనుకోవద్దండీ ఆ పిల్ల. ఇలా ఇలా రాకపోకలు మొదలై, స్నేహం కుదిరి, ముదిరి, లవ్‌లో పడే ఛాన్సుందేమోనన్న ఆశ కదండీ పాపం!"

"ఆఁ... మీ ఆయనే దొరికాడు ఇంతోటి అందగాడు. ఆ అమ్మాయికి కావాలంటే దొరకడా! పెళ్లయినవాడు, ఇద్దరు పిల్లలవాడు, గుమాస్తాగాడు... దానికేం ఖర్మ ఇతన్ని వరించడానికి!"

"అది మీకు తెలుసు, నాకు తెలుసు. ఆయనకి అంతమాత్రం ఆలోచన ఉంటే పెళ్లయినవాడిని... పిల్లలవాడిని ఏం చూస్తుంది నాలో అనుకోడండీ! ఏమో పాపం, ఈ రోజుల్లో మహామహా సినిమా తారలే పెళ్లయినవాడిని, పిల్లలవాడిని వరించి వాడిని వల్లిక్కుగా పెళ్లాడే ధైర్యం లేకపోయినా గుట్టుచప్పుడు కాకుండా గుళ్లో పెళ్లాడి రెండో భార్యగా సెటిల్ అయిపోతున్నారు గదండీ! పాపం అలా ఈ అమ్మాయీ తనని మోహించేస్తే... ఆశ కదండీ ప్రతి మనిషికీ!"

"ఏడ్చినట్టుంది! తా దూర కంత లేదు, మెడ కో డోలు...! ఇప్పటికే ఉంది, ఇంక రెండో డోలు కూడానా వాడి మొహానికి అడగాల్సింది నిలేసి! అద్దంలో ఎప్పుడన్నా మొహం చూసుకున్నావా అని దులపాల్సింది!"


"అయ్యో రాత! రామాయణం అంతా విని రాముడు సీతకేం అవుతాడంటారేమిటి బాబూ! అంత దులిపే ధైర్యం ఉంటే బూజుల కర్ర పెట్టి ఆయన బ్రైన్ తుప్పు ఎప్పుడో వదలకొట్టేదాన్ని కదా!"

"సరేలే... సరేలే... ఇంతకీ ఆ రోజు ఏం జరిగింది చెప్పు... చెప్పు!"

"అహబ్బ ఏం కుతూహలం? ఇంకోళ్ల విషయాలు వినడానికి...! ఆ రోజు గమ్మత్తు జరిగిందిలెండి... పాపం, ఈయనగారు అంత హడావుడీ చేశారా! తీరాచేసి ఆ పిల్ల వస్తూనే నా చెయ్యి పట్టుకుంది స్నేహంగా. ఆయన మొహం వైపైనా చూడలేదు. నాతోపాటు వంటింట్లోకి వచ్చేసింది 'అక్కయ్యగారూ!' అంటూ. 'నా కోసం చేశారా పకోడీలు! నాకు భలే ఇష్టం!' అంటూ సగం నిల్చునే తినేసింది. 'అయ్యో మీ రిక్కడ ఎందుకండీ! హాల్లో కూర్చుని మీ రిద్దరూ మాట్లాడుకోండి, టిఫిను తింటూ!' అంటూనే ఉన్నాను. వినిపించుకుందా...!

ఆయనక్కడికీ మాడిన మొహంతో వంటింట్లోకి తొంగి చూసి,

"ఆవిడ నలా నిలబెట్టి అక్కడేం మాటలు?" పళ్ల బిగువున గుర్రుమని నావంక చూశారు. 'మీ కెందుకండీ వెంకట్రావుగారూ! మేం ఆడవాళ్లం... ఏదో మాట్లాడుకుంటాం...' అంటూ ఆయన మాటలు లక్ష్యపెట్టలేదు. మాడిన మొహంతో ఆయన పోయి కుర్చీలో కూర్చున్నారు. కాఫీ కలిపి బలవంతాన నేనే ముందు గదిలోకి లాక్కొచ్చాను. ఆయన మొహం కాస్త విడింది. సంబరంగా ఏదో అనబోయేలోగా ' మీ ఆవిడ పకోడీలు ఎంత బాగా వేసారో... నోట్లో కరిగిపోతున్నాయి. ఈ కాఫీ ఎంత బాగుందో... వంటలవీ కూడా బాగా చేస్తారనుకుంటాను' అంది. ఆయన మొహం అప్రసన్నంగా పెట్టి, 'ఆఁ... దానిమొహం...! ఏదో,



దానికంతకంటే ఏం వచ్చు...? మీలా చదువు సంధ్య లేదుగా! వంటా వార్పేగా దానికొచ్చింది!'

'ఆఁ, మీ మగాళ్ళకి చక్కగా వండిపెట్టే పెళ్లాం ఉంటే విలువేం తెలుస్తుందీ? మీలాంటి వారికి అసలు కృతజ్ఞత అన్నది లేదు' ఆ పిల్ల వస్సట్టూ పొగుడుతూంటే ఏం చెయ్యలేక ఓ వెర్రి నవ్వు నవ్వారాయన. కాఫీ తాగినట్టున్నారు. 'ఓ అరగంట బయట తిరిగిరండి పిల్లల్ని తీసుకుని. ఈలోగా మేం మాట్లాడుకుంటాం. మీరెందుకు మధ్యలో ఆడాళ్ల మాటల్లో?' అంటూ ఆజ్ఞ జారీచేసింది. ఆముదం తాగినట్టు మొహం పెట్టి ఏడవరాని నవ్వు నవ్వి చచ్చినట్టు పిల్లల్ని వెంటేసుకుని బయటకు నడిచారు. నడుస్తూ పళ్లు కొరుక్కోవడం నా కళ్లపడిందిలెండి!"

"కుదిరిందిలే రోగం! ఆ పిల్ల ఎవరో గడుసుదానిలానే ఉంది!"

"గడుసేం ఖర్మం, మహా గడుసు. ఆయనలా వెళ్లగానే నా చేయి పట్టుకుని, 'మీరు ఎందుకూరుకుంటారండీ ఆయనలా మాట్లాడుతూంటే... మిమ్మల్ని కొడతారట గదా! అలా చూడకండి, నాకు తెల్సిందిలెండి. మీ ఇంటి పక్కవాటాలో ఉండేవారే ఇదివరకు... ఆవిడ మా మేనత్తకూతురేలెండి. మీరు మరీ అమాయకులు గనుక ఆయన ఆటలు చెల్లుతున్నాయి. ఊరుకుంటుంటే మరీ లోనవుతారు...' ఆ పిల్ల సానుభూతి చూపేసరికి కళ్లు నిండాయి. "ఏం చెయ్యమన్నారు, ఎదిరిస్తే మరి రెండు తగులుతాయి!' గుండెల్లో బాధ కన్నీళ్లయి పారాయి, చెప్పుకోడానికో ఆత్మీయురాలు దొరికేసరికి.

'ఈయన గారి అందానికి, చేసే బోడి ఉద్యోగానికి మీరు సరిపోలేదు... ఏం, చేసుకున్నప్పుడు కళ్లు మూసుకున్నాడా, వెధవ్వేషాలు కాకపోతే! పిల్లల తండ్రి అయి నన్ను చూసి చొంగ కారుస్తాడు, డర్టీ ఫెలో! ఇదిగో, మీ కోసమే ఇంటికి వచ్చాను, వాడి మొహం చూసి కాదు. ఆఫీసులో వీడి వెకిలి వేషాలు చూస్తున్నామక. కొంగు తగిలితే పరవశిస్తాడు, మాట్లాడితే చాలు వంకరలు తిరుగుతాడు. కాలేజీ కుర్రాడి ననుకుంటున్నాడుగాబోలు... ఇదిగో ఇలా మీ ఆయన్ని తిట్టానని కోపం రాదు కదా!'

'కోపమా, సంతోషం! పట్టరాని సంతోషం...! ఇన్నాళ్లకి నేను మనసులో అనుకునే మాటలు, ధైర్యంగా పైకి అనే అమ్మాయిని చూసి సంతోషంగా ఉందమ్మా! నా కంటే చిన్నదానివి. చెల్లి ఆవనా! నేనేం పతివ్రతని కాదమ్మా! మొగుణ్ని ఎవరన్నా ఏదన్నా అంటే శపించేయడానికి... నా మొగుడిని అన్నవాళ్లని తిట్టేంత భక్తి, గౌరవం, ప్రేమ నాకేం ఉన్నాయి ఆతనిమీద? తిట్టమ్మా... బాగా తిట్టు! ఇంకా కావాలిస్తే మొహంమీద పేడనీళ్లు జల్లు కాస్త!'

'తప్పకుండా జల్లుతా! నా కొక నెల టైమియ్యి! ఇదిగో... ముందుగా నీకు చెప్పి నీవు మరేం అపార్థాలు తీయకుండా ఉండడానికే చెప్పాలని వచ్చా. ఒక్క నెలరోజులు టైమియ్యి. ఈలోగా నేనేం చేసినా నీవడగవద్దు. నీ మొగుడికి పుట్టిన తెగులు అణుస్తాను. వీడి మొహం చూసి నేను ప్రేమించేసి వెంటబడ్డా ననుకుని కలలు కంటున్నాడు. చదులుస్తా... ఆ రోగం! చూస్తూండు. నీ మీద మళ్లీ చెయ్యి వేయకుండా బుద్ధి చెపుతా, వేస్తున్నా మంచి ప్లాను!"

"ఆ పని చెయ్యమ్మా! నీ ఫొటోకి రోజూ దండం పెట్టుకుంటా. నే చెయ్యలేని పని నీవు చేసిపెట్టు, చెల్లీ! నాకు మంచిరోజులొచ్చే నీవీ ఆఫీసుకి వచ్చినట్లున్నావు.

'మన ఆడవాళ్లకి ఆడవాళ్లే సాయం చేసుకోకపోతే ఎలా అక్కయ్యా? ... నీ మొగుడిలా వెంటపడి వెధవ్వేషాలు వేయకపోతే నా కెందుకులే అనుకునేదాన్ని. నీ గురించి తెలిశాక మనం మనం ఒకటయి పిచ్చి వేషాలు వేసేవాళ్లకి బుద్ధి చెప్పాలనే నిర్ణయించుకున్నా!' అంది సుషుండి!"

"అయ్యో, పాపం, మంచి పిల్లే అన్నమాట, ఏదో టక్కులాడి అనుకుంటూ మనం ఏదో అనుకున్నాం!"

"అదేనండీ, ఇలాంటి పిల్లనా నేను అలా అన్నాను అని మనసులోనే కాదండీ, అమ్మాయి ఎదురుగానూ చెంపలేసుకున్నాను. అది సరే, ఈయనగారు పది నిమిషాలు కష్టంమీద బయట తిరిగి మాడుమొహంతో తిరిగొచ్చి, నవ్విమొహంతో 'అయ్యాయా మాటలూ, ఆవిడతో, ఇంక నాతో మాట్లాడండి!' అని వెకిలి నవ్వు నవ్వాడు. ఆ అమ్మాయి 'మనం రోజూ ఆఫీసులో మాట్లాడుకుంటూనే ఉంటాంగా, ఇంక నే వెళ్లాలి' అంటూ లేచిపోయేసరికి పాపం మానవుడి మొహం చూడాలి ...! ఏదో అనబోయి 'పదండి, ఆటో ఎక్కించి వస్తా!' అంటూ వెంటపడేసరికి...

'మీ రెక్కించేదేమిటండీ, రోజూ తిరిగేదానికి నాకేం కొత్తా ఈ పూరూ?' అంటూ రయ్యిన దూసుకెళ్లిపోయింది. ఉస్సూరంటూ కూలబడ్డారు. చురచుర నావంక చూశారు. 'ఏం మాట్లాడుకున్నారేమిటి, నీతో మాటలేమిటి ఆవిడకి, మొద్దుమొహానివి ఒకదానికొకటి ఏం మాట్లాడావు?'

"మొద్దు మొహాన్ని ఏం మాట్లాడుతా, పకోడీలు తినండి, పాపం చేయించారు!"

"నీవే మింగు అది కూడా! ఛా! నీ వింట్లో తగలడబట్టే..." పళ్లు కొరుక్కున్నాడు పాపం.

"శాస్తి బాగా జరిగిందిలే!"

"ఇదేం శాస్తిలెండి... అసలు శాస్తి చేస్తానంది. చూడాలి ఏం చేస్తుందో, వెళ్లాళ్లుఉందిగా!"


"ఆగుదాం మరి. నెలేం ఖర్మ, నీ బతుకు బాగుపడుతుదంటే ఇంకో నెలా ఆగచ్చు."

"నా బతుకింకేం బాగుపడుతుందిలెండి? నాది బాగుపడకపోయినా ఆయనేమిటో ఆయనకి అర్థం అయి నోరు మూసుకు చచ్చినట్టు పడి ఉంటే అదే సంతోషం నాకు!"

"అంత నిరాశ వద్దులే తల్లీ! పద్దవాళ్లెప్పుడూ చెడ్డవారు కాదు. ఓ వాక్యానికి ఎప్పటికన్నా ఓ ఫుల్‌స్టాప్ ఉంటుంది. అట్లాగే నీ కష్టాల కథకి ఫుల్‌స్టాప్ పడచ్చమ్మా!"

"మొగుడన్న వాడర్థం చేసుకోకపోయినా మీలాంటివారి సానుభూతే నాకు ఓదార్పు!"

"ఏమండోయ్! కథ ముగింపు చెప్పనా, చెపేస్తున్నా మా ఆయనకి ఎంత బాగా బుద్ధి



చెప్పిందో చెప్పనా! నెల్లాళ్లడిగింది టైము కానీ, ఇరవై రోజుల్లోనే ఆయన రోగం కుదిర్చేసిందిలెండి!"

"ఎలా, ఎలా... ఏం చేసింది?"

"ఏం చెయ్యలేదండీ, ఈయన్ని వెంటపడనిచ్చింది, వెర్రి నవ్వులు, వెకిలి వేషాలూ చూస్తూ ఊరుకునేసరికి ఈయనగారు రెచ్చిపోతూంటే ఓ పిసరు ఎంకరేజ్ చేస్తూ చిరునవ్వులు, చిలిపి చూపులు చూసేసరికి ఈ మానవుడు బొక్కబోర్లాపడి తనంటే ఇష్టమని, లైన్లోకి తెచ్చేసుకున్నానని మురిసిపోయి, మరింత ముందుకెళ్లిపోయి పార్కులకి, సినిమాలకి, లంచ్‌లకి, డిన్నర్లకి పిలిచేసి, చిన్నచిన్న బహుమతులిచ్చేసి, ప్రొసీడ్ అయిపోయారీయనగారు పది రోజులలోనే. తనని ప్రేమించేస్తోందని, అంత సులువుగా బుట్టలో వేసేసిన తన చాకచక్యానికి మురిసిపోతూ మరికాస్త ప్రొసీడైపోయి 'రూమ్ బుక్ చేశాను, రమ్మన్నారట!' 'అయ్యబాబోయ్! హోటల్‌కి రమ్మంటున్నావేమిటి, నేనేం అలాంటి ఆడదాన్ని కాను బాబూ! పెళ్లి కాకుండానే ఇలాంటి పనులు చస్తే చేయను! మీ మగాళ్లను నమ్మడానికి లేదు!' అంటూ అమాయకంగా నటించిందట.

'మనం ప్రేమించుకుంటున్నాం, పెళ్లి చేసుకో కావాలిస్తే, కానీ ఇలాంటి పనులకి నే నొప్పుకోను' అనేసిందట! ఈయనగారు పెళ్లనేసరికి కాస్త ఖంగుతిన్నాడట. పెళ్లాం పేరుతో ఇంట్లో నేను తగలడ్డందుకు, అంత తొందరపడి నన్ను కట్టుకున్నందుకు తిట్టుకుని, నన్నెట్లా వదిలించుకోవడమో అర్థం కాక తల పట్టుకుని, అంతలోనే ఓ ఆలోచన మెరుపులా మెరిసి, 'మనం గుళ్లో పెళ్లి చేసేసుకుందాం!' అన్నాడట.

'మరి మీ ఆవిడో... ఊరుకుంటుందా?' అందిట.

'ఏడ్చింది... ఊరుకోక ఏం చేస్తుందిట. నోరు మూసుకు ఓ మూల పడి ఉంటుంది. మనకెలాగో వంటకి, పనికి మనిషి కావాలిగా. నీవు కాలు కింద పెట్టకుండా చేసిపెడ్తుంది.'

"అమ్మబాబోయ్! అలా అయితే నాలుగు రోజులు వాడుకుని నీ మోజు తీరాక నన్నింట్లోంచి వెళ్లగొడితే నేనే కావాలి. నా గతేం కావాలి, అలా నే నొప్పుకోను. చట్టబద్ధంగా పెళ్లాడాలి అన్నదిట. ఈయనగారు జుట్టు పీక్కున్నారు. లాయర్లని కలుసుకున్నారు. పెళ్లానొదిలేయడం అంత తేలిక కాదు, కారణాలు చూపాలి, డబ్బు కట్టాలి, పిల్లలకి, పెళ్లానికి పోషణకి డబ్బులు ఇవ్వాలి అంటూ లాయర్లు బెదరగొట్టారుట. ఈయనగారు కాళ్లా వేళ్లా పడి, స్టాంపు పేపరు మీద తనని పెళ్లి చేసుకుంటున్నట్టు, ఆమెకి భార్యగా అన్ని హక్కులు ఇస్తున్నట్టు, మొదటి భార్య కేవలం పేరుకేనని కాగితం రాయించుకుందట. కాగితం చేతిలోకి రాగానే 'ఈ శుభవార్త ఆఫీసులో చెప్పేద్దాం' అనేసరికి ఈయనగారు గాభరా పడిపోయి వారిస్తున్నా వినకుండా చేయిపట్టుకుని లాక్కెళ్లి అందరిముందూ చెప్పేసిందట. ఇద్దరం పెళ్లి చేసుకుంటున్నాం అని. అంతే! కాసేపు తెల్లబోయి, తిట్టడం మొదలెట్టారుట.

'మగాడికి బుద్ధి లేకపోతే నీ బుద్ధి ఏమైంది, ఇంకో ఇల్లాలి కాపురం కూలుస్తావా, పిల్లల తల్లి ఏమైపోతుందని గడ్డిపెట్టారుట.

'ఆ గడ్డి నాకు కాదు పెట్టాల్సింది, ఈ మహానుభావుడికి పెట్టండి! వీడి మొహానికి ఒక పెళ్లాం చాలక ఇంకొర్తి కావాలిట. ఈయనగారి అందానికి, చేసే ఉద్యోగానికి వీడి స్టేటస్‌కి పాపం ఆ ఇల్లాలు చాలలేదట. వదిలేస్తాట్ట. దాసిగా ఇంట్లో ఉండనిస్తాడట. నా వెంటపడి వీడి మొహం చూసి నే ప్రేమించేశాననుకుని పెళ్లాన్ని వదలడానికి తయారైన ఈ ప్రబుద్ధుడికి గడ్డిపెట్టండి. వీడి వాలకం, వెకిలి వేషాలు కనిపెట్టి, ఆ అమాయకపు ఇల్లాలు వీడి చేతిలో పడుతున్న అవమానాలు తెలిసి వీడికి బుద్ధి చెప్పాలని, ఊరికే అంటే నమ్మరేమోనని కాగితం రాయించుకున్నా! ఈ ప్రూఫ్ చాలుగా ఇంక వీడికి దేహశుద్ధి చేస్తా అని కాలి చెప్పు తీసిందట. ఈయనగారు వంచిన తలెత్తలేక, నల్లబడిన మొహం ఇంకా కాస్త దించుకుని, ఆ అమ్మాయిని మింగేసేట్టు చూసి పరుగెత్తి బయటపడ్డాడట. అంతా బాగా అయింది శాస్తి అని ఒకటే నవ్వారుట.

"బాగా బుద్ధి చెప్పిందే! ఇంటికొచ్చి ఏమీ అనలేదు కదా నిన్ను?"

"నన్నేం అంటాడు? నేనేం చేశాను కనుక, ఆయన తిడితే పడ్డాను. కొడితే భరించాను. పతివ్రత పెళ్లాన్ని కదా! మాడిపోయి మొహంతో మంచం ఎక్కి ముసుగు తన్ని పడుకుని, రాత్రికి రాత్రికి పాపం జ్ఞానోదయం అయి తెల్లారగట్టకి గౌతముడు బుద్ధుడు అయిపోయినట్టు, ఈయనకి కట్టుకున్న దానికంటే ఎవరూ ఎక్కువ కాదన్న సత్యం అర్థమైపోయి, మనసు ఆర్ద్రమైపోయి నన్ను కౌగిలిలోకి లాక్కుని గుండెలమీద తల ఆన్చుకుని, (లోలోపల కన్నీళ్లతో గుండెల్ని ప్రక్షాళనం చేసుకుని) తొమ్మిదేళ్లల్లో ఏనాడూ చూడని ప్రేమ చూపాయి ఆ చేతులు... ఆ అమ్మాయి మర్నాడు జరిగింది చెప్పనక్కరలేకుండానే ఆయన చేతులే నిజం చెప్పేశాయి.

"అమ్మయ్య! సాధించావు ఆఖరికి! కథ సుఖాంతం అయింది. పాపం, నీ కోసం అందరిచేత మాటలు పడ్డ ఆ అమ్మాయికి ఏదన్నా ఇవ్వద్దూ బహుమతి!"

"నా బొంద... ఇచ్చేందుకు నా దగ్గరేం ఉంది. పెట్టె అడుగున ఉన్న ఓ రవికెల గుడ్డ, ఓ అచ్చు వెండిరూపాయి... మా బామ్మిచ్చింది ఉంటే ఇంత పసుపు కుంకం పొట్లం కట్టి మర్నాడు వస్తే బొట్టుపెట్టి ఇచ్చి, చిన్నది కనుక చేతులు కళ్లకద్దుకున్నాను!"

"పోనీలే, పడ్డవారు చెడ్డవారు కాదని నిరూపించావు. నీ శాంతమే నీకు రక్ష అని నిరూపించావు.

"ఏదో గతిలేక భరించిన శాంతం అండీ బాబూ! నాకు అంత బిరుదొద్దు!"

"ఏదో శాంతంలే, క్షమయా ధరిత్రీ అన్న బిరుదు ఉండనే ఉందిగా ఆడవాళ్లకి. అది నిజం సుమా అనిపించావు. అది చాలులే. ఇంక వెళ్లు, మళ్లీ మా ఆయనకి ఏ తిక్కా రాకుండా కొన్నాళ్లయినా ఉంటాడులే!" ■

